3

# మేష్టారుగారికి గౌరవంతో

దీపావళికి ఇంకా రెండు రోజులుంది. అక్కడక్కడా, అప్పుడప్పుడూ టపాకాయల శబ్దాలు వినిపిస్తున్నా, ఊరు ప్రశాంతంగానే ఉంది. నేనూ అంత నిశ్శబ్దంగానే ఆ ఇంటి ముందు నుంచున్నాను. సరిగ్గా పదిహేనేళ్ళ క్రితం - ఇలాంటి రోజునే, ఆ ఇంటి ముందు నా భవిష్యత్తు మారిపోయింది.

ఆ ఇంట్లోకి వెళ్ళడానికి నాలుగు మెట్లు. ఆ తర్వాత పసుపు పెయింట్ వేసిన గుమ్మం. ఆ మెట్లకి రెండువైపులా నల్ల సిమెంటు అరుగులు.

రెండడుగులు ముందుకేసి, ఆ అరుగుని చేత్తో మెల్లగా రాశాను. ఇదే అరుగు. నా జీవితానికి పునాది పడింది ఇక్కడే. ఆ గోడకి వీపు నానించుకుని, ప్రైవేటుకొచ్చే మిగతా పిల్లలతో చదువుకున్నాను.

ఈ అరుగు నన్ను గుర్తుపట్టిందేమో! పట్టే ఉంటుంది. సాయంత్రం అయ్యేసరికి రెండరుగులమీద పిల్లలు. ఓ కిటికీ పక్కన, పడక్కుర్చీలో మేష్టారుగారు కూచుని, పిల్లలతో జవాబులు అప్పచెప్పించుకుంటూనో, లెక్కలు, ఎక్కాలు దిద్దుతూనో ఉండేవారు.

ఇప్పుడవన్నీ బ్లాక్ అండ్ వైట్ సినిమా దృశ్యాలు. అరుగులున్నాయి. కానీ, ఖాళీగా... కూలిపోవడానికి సిద్ధంగా ఉంది, ఓ వైపు గోడ.

మెట్లెక్కి, ఓ చెక్క స్తంభానికి ఆనుకుని అరుగుమీద కూచున్నాను. "ఉరేవ్! వెంకా!"

ఇదే... ఇలాంటి పిలుపే ఆ రోజున వినపడింది.

ఇలాగే... పొద్దున్న... జానకమ్మగారు నీళ్ళు తోడుతూ పిలిచారు.

"ఉరేవ్, చద్దివణ్ణం తిన్నాక, నిన్న రాత్రి నానపెట్టిన ప్రమిదల్ని ఎండపెట్టడం నీ వొంతు. మావిడాకులు నువ్వూ, వీరబద్దరం కలిసీ కోసుకొచ్చి, వసారాలో దొక్కులకుంచె పైనున్న చూరులో పురికొస తాడుంటుంది. సత్తిపండు కూడా వస్తాడులే. తోరణాలు, అన్ని గుమ్మాలకీ కట్టాలి".

నేను, జానకమ్మగారి కొడుకులు వీరబద్దరం, సత్తిపండు పాక దగ్గరున్న మామిడి చెట్టెక్కి ఆకులు కోసుకొచ్చి పడేశాం.

"వెంకా! వణ్ణం తినెయ్యి. ఇంకా బోల్డు పనులున్నాయి" జానకమ్మగారి గొంతు.

పెరట్లో ఓ వైపునున్న వసారాలో కూచుని, చద్దెన్నం ఆవకాయతో, మెల్లగా తింటున్నాను.

దగ్గరగా చేరేసిన పెరటి తలుపులు, భడాలున, పెద్దగా శబ్దం చేస్తూ తెరుచుకున్నాయి.

ఉలిక్కిపడి, తలెత్తాను.

ఓ నలుగురు పెద్ద మనుషులు, ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు లోపలికి వచ్చి, నా ముందు నుంచున్నారు. తల దించుకుని, తరవాణిలో చూపుడు వేలుతో గీతలు గీయడం మొదలెట్టాను. వాళ్ళ ముందు సిగ్గుతో మొహమాటంతో అన్నం తినలేక పోయాను.

ఆ నలుగురు అక్కడ నుంచి కదలకపోవడంతో, మెల్లగా, తల ఎత్తి కళ్ళు ఎత్తి చూసి, మెల్లిగా లేచి నుంచున్నాను.

"వీడే... వీడేనండి బుల్లెంకడంటే. మునుపు మేష్టారిగారి దగ్గర పన్చేసే పెద్దెంకడి కొడుకు... వయసు పదమూడు. వీడినాన్నండి, మేష్టారుగారి దగ్గర పదివేలు తీసుకుని, పదేళ్ళ క్రితం దుబాయెళ్ళాడు. ఇంతవరకూ అజా - అయిపూ లేదు. ఉన్నాడో,

పోయాడో తెలీదు. వాడు రాలేదు, వీడిక్కడి నుంచి కదల్లేదు. ఇది వెట్టిచాకిరి. దీన్ని మనం ఖండించాలి... ఏఁవంటారు?"

ఈ మాటలన్నాయన ఉగ్గరం బాబుగారు.

మాటలు విన్నాయన పంట్లాం, పొట్టి చేతుల చొక్క వేసుకుని, ఓ నీలం రంగు టోపిని పెట్టుకుని ఉన్నారు. ఆయన నాకేసి ఎగాదిగా చూసి, వెనక్కి తిరిగారు.

"సడేలే. వణ్ణం తింటున్నావు లావుంది. ఉఁ... తిన్నాకా, అలా వీధి గుమ్మం వైపుకి రా. నీతో ఓ విష్యం మాట్లాడాలి" అని అన్నారు దొరబాబు.

కోసిన మాఁవిడాకుల గుట్ట, పురికొసతాడుని చూస్తూనే, తిన్న కంచాన్ని, కాగుకింద ఉన్న కచ్చిక తీసుకుని, తోమి, ఓ వారగా ఆనించి, వీధి వైపుకి, భయం భయంగా వచ్చాను.

ఆ రెండరుగులమీద, కొంతమంది కుర్చీల్లో, ఓ ఇద్దరు అరుగుమీద కూచున్నారు.

గుమ్మం దగ్గర మేష్టారుగారి అబ్బాయిలు, వీరబద్దరం, సత్తిపండు నుంచుని ఉన్నారు. వాళ్ళ వెనక్కాల జానకమ్మగారి ఆకుపచ్చ చీర కుచ్చిళ్ళు మాత్రం కనిపిస్తున్నాయి.

"ఉరే, బుల్లే! ఇలారారా!"

"ఆయ్" రెండడగులు ముందుకేసి, కొబ్బరి మట్టలతో దింపిన పంచరాటకి వీపు ఆనించి, కళ్ళు వాల్చి నుంచున్నాను.

"ఉరే, ఈన గవర్మెంటాపీసరు. మనూళ్ళో వెట్టిచాకిరి కేసుందని ఎవరో కంప్లేంటిచ్చారుట. దాన్ని బట్టుకుని వచ్చారు.

బాబుగారు, ఏవో ప్రెశ్నలడుగుతారుట. అన్నింటికీ బయ్యం లేకుండా జబాబియ్యి..." అన్నారు ఉగ్గరం బాబుగారు.

తలెత్తకుండానే మెల్లగా తలూపాను.

"రాజోలు దగ్గరున్న మేనమామ దగ్గర నిన్నుంచకుండా, డబ్బు తీసుకున్న మేష్టారుగారి దగ్గర ఇన్నేళ్ళూ ఉన్నావంటే, దీన్ని వెట్టి అనే అంటారు అద్సరే... ఏం పన్చేస్తావేంటి?"

మేష్టారు వైపు చూసి, పంట్లాం ఆయన కేసి చూసాను.

"పొలానికెల్తుంటావా!"

తల అడ్డంగా ఊపాను.

"మరి... ఏం చేత్తాంటావో, ఆ బాబుగారికి చెప్పు!" దొరబాబు అంటూంటే భయంగా చూశాను.

"పొయ్యిలిగిస్తాను. నీళ్ళు తోడి గోలేల్లో పోస్తాను. నట్టింటి గుమ్మం దగ్గర ఓ బాల్చీడు, అరటిచెట్ల దగ్గర ఓ బాల్చీడు, కాళ్ళూ చేతులూ కడుక్కోడానికి పెడ్తాను"

"మద్దినాడ..."

"మద్దినాడ అలా పాక దగ్గరికెళ్ళి, ఆవుకి, ఎడ్లకి గడ్డెట్టి నీళ్ళూ అదీ పెట్టి, పళ్ళెం తిన్నాక, పాక కెళ్ళి పడుకుంటాను. నూని, అగ్గిపెట్టి ఇలా ఏదైనా కావాల్సొస్తే కొట్టుకెళ్ళి తెత్తాను".

ఒక్కసారి అందర్నీ చూసాడు గవర్నమెంటాయన.

"ఊఁ... అయితే, సూర్యోదయం మొదలుకొని, సూర్యాస్తమయం వరకూ ఏదో ఒక పనిచేస్తావ్! ఔనా! అంతేనా!..."

తలూపాను.

"మరి చదువో... బళ్లోకెళ్తున్నావా!"

నేనేం మాట్లాడలేదు. మా నాన్నకే అక్షరాలు పదేళ్ళకొచ్చాయి. ఎలా దుబాయ్ వెళ్ళాడో తెలీదు. అసలు వెళ్ళాడో లేదో! మా అమ్మ అస్సలు చదువుకోలేదు. జగ్గన్న తోట ప్రభల తీర్థానికెళ్ళి, అలాంచి అలాగే ఎవరితోనో వెళ్ళిపోయిందట. నాకు తిండి పెట్టడం దండగనుకుని, నా మేనమామ మేష్టారు గారింట్లోనే వదిలేశాడు. పొలం పనికి సాయంగా రమ్మనమని ఆర్నెల్లుగా కబురెడ్తున్నాడు. రాజోలొచ్చేయమని అటూర్రొచ్చేవాళ్ళతో ప్రతీసారీ చెప్పిస్తున్నాడు. నాకిక్కడే బావుంది. ఇంట్లోనే రోజూ సాయంత్రం ప్రవేటు కొచ్చే పిల్లల్తో నేనూ చదువుకుంటున్నాను. మేష్టారుగారి పిల్లలు సత్తిబండూ, వీరబద్దరం కూడా నాకు చదువు చెప్తూంటారు. లెక్కలు చేయిస్తూంటారు. ఇదే చెప్పాలా! బళ్లోకెళ్టం లేదని చెప్పాలా!

"ఏరా! చదువు సంకనాకిందేటీ?" అని మేష్టారు వైపు తిరిగి అన్నాడాయన. "ఏం మేష్టారూ! పెద్దెంకడి బాకీ తీరడం కోసం, వీడిని మీ ఇంట్లో ఉంచుకుంటున్నారా! మీరు పెద్దవారు. ఈ ఊళ్ళో మీరంటే అందరికీ గౌరవం. అందుకని చెప్పేసి, మీకేం శిక్ష అదీ పడకుండా చూడమని ఊళ్ళో వాళ్ళన్నారు. ఇంక వీడితో మీరు పని చేయించుకోకుండా, వీడిని బ్రిడ్జి స్కూలుకి పంపుతాం..."

మేష్టార్ని ఆయనలా అనడం నాకు బాధ కలిగించింది. నా మూలంగా, మా నాన్న మూలంగా ఆయన్ని అన్నారే అనిపించింది. నా వల్ల ఆయన తల వొంచుకునే పరిస్థితి వచ్చింది.

"ఒరే... బుల్లెంకడూ! ఇవ్వాళ్టించి నువ్వు సొతంత్రుడివిరా... నువ్విక్కడ పన్చెయ్యక్కర్లేదు..." అన్నారాయన.

ఆశ్చర్యంగా ఆయన్ని చూశాను.

"మేష్టారు గారి దగ్గర నీ బాబు తీసుకున్న డబ్బుని నువ్వు ఈనక్కర్లేదు. ఆ అప్పు తీరడం కోసం నువ్వు ఈ ఇంట పని చేయక్కర్లేదు. నువ్వు బాల కార్మికుడివి కాదు. నువ్వు ఫ్రీ, నీకు ప్రెబుత్వం స్వేచ్ఛనిచ్చింది. నువ్వీ ఇంట్లో పాలేరుగా ఉండక్కర్లేదు. సొతంత్రుడివి. ఇంకిక్కడుండక్కర్లేదు..."

అయోమయంగా చూశాను.

ఇక్కడుండక్కర్లేదంటే ఎక్కడుండాలి? ఎక్కడ పడుకోవాలి? వణ్ణం అదీ ఎవరు పెడ్తారు? నా బాబు అప్పు నేను తీర్చక్కర్లేదా?

ఎన్నో ప్రెశ్నలు. ఇక్కడుండక్కర్లేదు అన్న దానికి కళ్ళల్లో నీళ్ళొచ్చాయి. ఆ మసక బారిన కళ్ళతోనే, మేష్టార్ని, జానకమ్మగారిని, సత్తిపండుని వీరబద్దరాన్ని, వాళ్ళ చెల్లెలు వీర్లక్ష్మిని చూశాను.

ఆ రోజున వాళ్ళందరూ నన్ను చూసిన చూపులు, ఈ రోజు వరకూ నాకు గుర్తే. అసలు మర్చిపోతెనే కదా!

మీ నాన్న ప్రయాణానికి డబ్బిచ్చి, నిన్నింట్లో ఉంచుకుని మేపినందుకు మాబాగానే శాస్తి చేసావ్రా అన్న అర్థం వస్తుందని నా కనిపించింది. అందుకే ఆ

చూపులకంత శక్తి. నన్ను బంధించాయి. నన్ను కట్టి పడేశాయి. గుండెల్లో ఋణభారాన్ని పెంచాయి.

వచ్చిన పెద్దమనుషులంతా వెళ్ళిపోయారు. నేసలాగే, ఆ రాటనానుకుని ఉండిపోయాను. అరుగు ఖాళీ అయిపోయింది.

ఎండెక్కి పోయింది.

"వెంకా!" మేష్టారుగారి పిలుపుకి ఉలిక్కిపడ్డాను.

"అయ్!"

"ఎంతసేపలా నుంచుంటావ్? నువ్విక్కడ నుంచి వెళ్ళిపోవాలి మరి"

ఎక్కడికెళ్ళాలి? నా ఊహ తెలిసినప్పట్నించి ఇక్కడే ఉన్నాను. ఇక్కడ నాకేం కష్టంగా లేదే! ఈ వేళ సొతంత్రం వొచ్చిందని హఠాత్తుగా అంటే ఎక్కడికెళ్టం?

"అయ్" అన్నాను కానీ, కదల్లేదు.

"నీతో మాట్లాడిన వాళ్ళని ఎరుగుదువా!"

"అయ్..."

"వాళ్ళిళ్ళకి వెళ్తే... నువ్వెక్కడుండాలో వాళ్లే చెప్పారు..."

"నేనిక్కడే ఉంటాను..." అంటూ ఏడ్చాను.

"ఇప్పటికే నీ మేనమామ నా పరువు తీశాడు, నా మీద పిర్యాదు చేసి, నువ్విలాగే అని, ఇక్కడే ఉంటే, మిగిలినది కూడా పోతుంది... ఆ పని చెయ్యకు..."

దొరబాబుగారింటికెళ్ళాను.. ఆయనింకా యింటికి రాలేదుట. ఉగ్గరం బాబుగారిల్లు వైనతీయం (గోదావరి) కెళ్ళే దార్లో ఉంది. అక్కడికెళ్ళాను బుల్లి రామయ్య గారింటికెళ్ళారని అన్నారు.

ఆయన ఇల్లు శివాలయానికెళ్ళే దార్లో ఉంది. అందుకని రెండు వీధులు దాటి అక్కడి కెళ్ళాను. ఆయన చిరాకు పడుతూ బయటికొచ్చారు.

"నువ్విటొచ్చావేంటీ... ఉం... పంచాయితీ ఆఫీసుకి పద నే తర్వాతొస్తాను... నా వెంట..." అంటూ ఆయన ఇలా బయటకొచ్చి, ఆ రెండూ ముక్కలు అనేసి, లోపలికెళ్ళిపోయారు.

పక్కవీధిలో ఉన్న ఆఫీసుకెళ్ళాను. అక్కడ పనిచేసే దాసు తప్ప మరెవరూ లేరు.

"ఏరా, ఏంటీ? ఇటొచ్చావేంటి?" దీర్ఘం తీస్తూ అడిగాడు దాసు.

నేనేం మాట్లాడకుండా, ఓ స్తంభానికి ఆనుకుని, మరో స్తంభానికి కాళ్ళు ఆనించి, కూచుని, కళ్ళ నీళ్ళు తుడుచుకున్నాను. అలాగే కునుకు పట్టేసింది.

"ఏరా.. ఆ... ఆ...! ఇంకా ఇక్కడే ఉన్నావా ఆ... ఆ... ఆ..." దీర్ఘం తీస్తూ బాబ్జీగారు వచ్చారు. ఆయనకి బోల్డు పొలాలు కొబ్బరీ ఉంది.

ఉలిక్కిపడి కళ్ళు తెరిచాను.

ఈ లోపలే ఉగ్గరం బాబు కూడా వచ్చారు. లోపల ఏం మాట్లాడుకున్నారో నాకు తెలీదు.

"ఉరే... వెంకా!... ఓ పనిచెయ్యిరా.. రేప్పొద్దున్నే రా... ఇంక ఉప్పుడేం, రాజోలెల్తాం?... సంజపడిపోతోంది. ఆఫీసు మూసేత్తారు. ఈ వేల్టికి అక్కర్లేదు. పొద్దున్నే చీకటితోటే వచ్చెయి. ఉప్పుడెళ్ళిపో..."

మెట్లు దిగాను.

వెళ్ళి రేపురా అన్నారు. ఎక్కడికెళ్ళాలి?

మధ్యాహ్నం ఎండ ఎక్కువ లేదు. కానీ, వేడిగానే ఉంది. అందరిళ్ళు ప్రశాంతంగా ఉన్నాయి. అరుగుల మీద ఇంకా ఆడవాళ్ళు కూచోలేదు.

గుడి దాటి, మంద బయలు దాటి, అలా వెళ్ళి వెళ్ళి, బుద్ద స్థూపాల దగ్గరున్న ఓ చెట్టుకింద కూచున్నాను (ఆదూరు గోదారొడ్డున ఉన్న స్థూపాలు ప్రసిద్ధి చెందినవి). సంజపడిపోతోంది. చెట్లమీద పక్షులు గోల చేస్తూంటే లేచి ఊరి వేపుగా నడిచాను. చీకటి పడిపోయింది ఊళ్ళోకి వచ్చేసరికి.

ఊళ్ళోకి కరెంటొచ్చినా, వెలుగుతున్న వీధి దీపాలు ఇచ్చే గుడ్డి వెలుతురు తప్ప, ఇళ్ళల్లోని లైటు వెలుగులు బయటికి రావడం లేదు.

చీకటి తెరలు దిగిపోతూంటే, ఏం చేయాలో తెలీక, ఎక్కడికెళ్ళాలో అర్థంకాక అయోమయంలో పడిపోయాను.

హఠాత్తుగా ఒంటరి వాడినయ్యాననిపించింది. ఆకలేస్తోంది. వణ్ణం ఎవరు పెడ్తారు? ఏడుపొచ్చింది.

తండ్రి దుబాయెళ్తుంటే వణ్ణం ఎక్కడ్నించి వొస్తుందని ఏడ్చాను.

"నేన్నిన్ను మేపలేనురా! నీ అమ్మ, బాబూ నిన్నొదిలేస్తే నాకేనా నువ్వు! నాకూ నువ్వక్కర్లేదు. ఆ మేష్టారింట్లోనే ఉండు..." అంటూ బలవంతంగా నాన్న పాలేరుగా పనిచేసే కామేసర్రావు మేష్టారింట్లో వొదిలేసి వెళ్ళిపోయాడు మేనమామ. ఆ రోజున కూడా చాలా ఏడ్చాను. ఆ తర్వాత వణ్ణానికి ఏనాడూ ఏడవ లేదు.

మళ్ళీ చాలా ఏళ్ళ తర్వాత, ఇవాళ ఏడుపొస్తోంది.

అలాగే మేష్టారుగారి గుమ్మం దగ్గర నుంచున్నాను. ఇంటి ముందు లైటు గుడ్డిగా వెలుగుతోంది. అరుగుల మీద ఎవరూ లేరు. పండగలని నాలుగు రోజులు ప్రవేటుకి పిల్లలు రామన్నారు.

నాలుగు మెట్లు ఎక్కి నుంచున్నాను.

మండువా పడిమీద, నిశ్శబ్దంగా కూచున్న జానకమ్మగారు ఎందుకో గుమ్మంవైపు చూశారు.

"ఎవరది? ఉరేవ్, సత్తిపండూ, గుమ్మం దగ్గర ఎవరో ఉన్నారు చూడు..." అంటూ లేచారు, ఆవిడ.

కాళ్ళకి కడియాలు, గొలుసులు, వేలికున్న చుట్లు, అన్నీ కలిసీ చేసే శబ్దం, చెవులకి అలవాటయిన శబ్దం, గుమ్మం దగ్గరిగా వచ్చి ఆగిపోయింది.

మసక వెలుతురులో ఆవిడ మొహం సరిగా కనపడడం లేదు.

"ఎవరూ? వెంకడేనా?"

"అయ్!"

"వచ్చావా! పొద్దున్నించి కొట్టుకుపోతున్నానురా. చల్దెన్నం తిని వెళ్ళినవాడు, మధ్యనాడ ఏమయినా తిన్నాడో లేదో అని వందసార్లు అనుకున్నాను. కంచం తెచ్చుకో, వణ్ణం పెడ్తాను..." ఆవిడ గొంతు వొణికింది.

ఆ వొణుకు లీలగా గుర్తొస్తోంది నాకు.

పొద్దున్న జరిగింది నాకు గుర్తున్నా, ఆవిడకి ఆ క్షణంలో గుర్తు రాలేదు. దాన్ని పట్టించుకోలేదు. నా కడుపుని చూసింది. దాన్నే పట్టించుకుంది.

నన్ను, నాన్న దగ్గర వదిలేసిన మా అమ్మ చూడనిది ఆవిడ చూసింది.

అలవాటయిన దారి, గంతలోంచి పెరటివైపుకెళ్ళాను. గోలేలన్నీ ఖాళీగా ఉంటే, వెంటనే అన్నీ నింపేశాను.

అన్నం తినేశాకా, కంచం గోడకి ఆనించి, మేష్టారుగారి గది బయట, ఉయ్యాల బల్లకి ఓ పైపున నా ఈతచాప వేసుకుని కొబ్బరి పీచు తలగడ వేసుకుని, ఓ పల్చటి దుప్పటి కప్పుకుని పడుకున్నాను.

మేష్టారుగారి గదిలోంచి గంతలోకి వెళ్ళడానికి తలుపుంది. అక్కడి నుంచి తూము దగ్గర. అక్కడే ఆయన అల్పాచమానం. అందుకే అక్కడ ఓ బక్కెట్టు నీళ్ళు పెట్టాను. ఆ కాళ్ళు కడుక్కునే శబ్దం నాకు నాలుగైదు సార్లు వినపడింది. దాన్ని బట్టి ఆయన రాత్రంతా నిద్రపోలేదు, నా మూలంగా. మా నాన్న మూలంగా. ఆయనకంతటి అవమానం జరిగింది.

మర్నాడు అందరికీ చెప్పి, నా బట్టల సంచీ తీసుకుని రాజోలు వెళ్ళాను. ఉగ్గరం బాబు దగ్గరుండి తీసుకెళ్ళారు. రాజమండ్రి వెళ్ళాం. అక్కడ ఓ స్కూల్లో పరీక్ష పెట్టి ఏడో క్లాసులోకి తీసుకున్నారు. ఆ భిక్ష మేష్టారుగారిదే. స్కూలుకెళ్ళకపోతేనేం, ఇంట్లో అరుగుమీదే నా చదువు జరిగింది.

అంతే, నా చదువుకి ఆటంకం కలగలేదు. ప్రభుత్వ హాస్టల్లో, చిన్న పిల్లలకి ట్యూషన్‌లు చెప్పేవాడిని. ఇది మేష్టారుగారి అడుగుజాడలు.

మార్కులు బాగా రావడంతో, చదువంటే శ్రద్ధ ఉండటంవల్ల, ఇంజనీరింగ్ చదివాను. పాసయ్యాను. వెంటనే మంచి కంపెనీలో చేరాను. ఉద్యోగంలో చేరినా, ఆదివారాలు ఇంటి దగ్గర పిల్లలకి ట్యూషన్‌లు చెప్పడం మానలేదు.

"ఎవరూ?" దీర్ఘం తీస్తూ, ఓ చేత్తో బుర్ర నిమురుకుంటూ, మరో చేత్తో కట్టుకున్న ఎర్రపట్టుపంచని పైకి దోపుకుంటూ, తలుపు శబ్దం చేస్తూ ఓ ముసలాయన బయటకొచ్చారు.

ఉలిక్కిపడ్డాను.

"మేష్టారుగారిని చూడ్డానికి, నేను బెంగుళూరు నుంచి వచ్చాను" వినయంగా అన్నా.

"మేష్టారా! అంటే కావేసశ్రావేంటి? వాడు ఈ యిల్లు మాకమ్మేసి వెళ్ళిపోయాడు. ఓ పనిచెయ్యి. రేవుకెళ్ళే దారిలో ఉగ్రనరసింహం ఉంటాడు. వాడి కన్నీ తెలుసు..." ఉగ్గరం బాబుగారిల్లు నాకు తెలీకపోవడమేంటీ? ఈ రోజున నేనిలా ఉంటానికి కారణం ఆయనే కదా! కృతజ్ఞతలు చెప్పినట్లుంది. నా పని కూడా అవుతుంది.

నన్ను చూసి ఆయన చాలా సంతోషించారు.

"అలాగే, మేష్టార్ని చూడు. ఆయన పరిస్థితేం బావోలేదు. డిగ్రీ పేసయినా ఉద్యోగం సరిగా దొరక్క వీరభద్రం, సత్తిపండు కులవృత్తి చేసుకుంటున్నారు. తండ్రి లాగానే సత్తిపండు ప్రవేట్లు చెప్తున్నాడు. వీర్లక్ష్మికి పెళ్ళయింది. మొగుడికి క్యాన్సర్. బాగా ముదిరిపోయిందిట.

అవుతే. గుడ్డిలో మెల్ల. ఏఁవిటంటే మేష్టారిగారి మనవలు వేదం బాగా నేర్చుకుంటున్నారు. ఈ మధ్యనే వేదశాస్త్ర ప్రవర్ధక ట్రస్టువారు పరీక్షలు పెట్టారట. మేష్టారుగారి మనవలు, అన్నింటా పష్టేట... వాళ్ళు ఇందుపల్లిలో ఉంటున్నారు. అక్కడ వేద, శాస్త్ర, శ్రౌత, స్మార్త, అపర, ఆగమ, విద్యలు నేర్పించే ఓ సంస్థ ఉంది. అక్కడికెళ్ళావనుకో ఎవరైనా ఇల్లు చూపిస్తారు.

ఇందుపల్లి ఎలా వెళ్ళాలో తెలుసా? ఇలా తిన్నగా వెళ్ళిపో. దొడ్డారం గోదారి రేవొస్తుంది. రేవుదాటు. బోడసక్కుర్రుకెళ్తావు. అక్కడ ఆటో తీసుకుని, ఇందుపల్లి వెళ్ళిపో... వాళ్ళందర్నీ అడిగానని చెప్పు..."

వెంటనే పడవ లేదు కానీ, పంటుంది. స్కూటర్లు మోటారు సైకిళ్ళు మనుషులంతా అంత దాని మీదే....

చలిగాలి వీస్తూండగా, ఆ గోదారి గాలి పీలుస్తూ, ఓ రకమైన మత్తులో అద్దరి చేరాను.

సాయంత్రం నాలుగు అవుతుండగా ఇందుపల్లి వెళ్ళాను.

దీపావళి హడావిడి దార్లో అంతా ఉంది. కానీ ఇందుపల్లి నిశ్శబ్దంగా ఉంది. అరుగుల మీద సభలు తీర్చి కూచుని, కబుర్లు చెప్పుకుంటున్నారు ఆడవాళ్ళు. మొగవాళ్ళు వీధిలో, కొంతమంది దీపాలు పెట్టారు.

మేష్టారుగారిల్లు కనుక్కోవడం కష్టం కాలేదు.

వీరభద్రం ఓ అరుగుమీద కొంతమందితో సంధ్యావందనం చేయిస్తున్నాడు. కొత్తగా వొడుగులయిన పిల్లల్లా ఉన్నారు. గుర్తు పట్టలేకపోయాను. ఓ పదేళ్ళు హడావిడిగా ముందుగానే వచ్చేశాయి. నన్ను పరిచయం చేసుకున్నాకా, కళ్ళల్లో మెరుపు కనపడింది. నువ్వా అన్నట్లుగా చూశాడు.

లోపలికెళ్ళి చెప్పాడు.

కాళ్ళ కడియాలు, గొలుసులు, కాలి చుట్లు అన్నీ కలిసిన శబ్దం, నాకింకా గుర్తున్న శబ్దం దగ్గరగా, ఇంకా దగ్గరగా జానకమ్మగారు. గబుక్కున వొంగి, దూరం నుంచె కాళ్ళకి దండం పెట్టాను.

"వెంకడివా! చల్లగా ఉండు. పెద్ద చదువు చదువుకున్నట్లున్నావు... మేష్టార్ని చూడచ్చావా!..." ఆ గొంతులో అదే మమత.

సత్తిపండు అరుగుమీద ఉన్న తలుపుని, లోపలి నుంచి తీశాడు. గదిలోకి వెళ్ళాను. సత్తిపండు చెప్తే... ఆయన మొహంలో, కళ్ళల్లో వెలుగు. ఇలాంటి క్షణం కోసమే ఈ ఊరొచ్చాను.

వెంటనే, చొక్క జేబులో ఉన్న పొడవాటి కవరుని, ఆయన కాళ్ళమీద ఉంచాను.

"అనాథగా ఉండాల్సిన నాకు అపురూపమైన, బాల్యాన్నిచ్చి, జీవితానికి పునాది వేశారు. నాకెవరూ లేరన్న భావాన్ని మీరెవరూ కలగనీయలేదు.

నా ముందు, నా వెనకా ఏముందో అన్నదే కాకుండా, నాలో ఏముందో తెలుసుకోడం, నన్ను తెలుసుకోడం ముఖ్యం... అనే చిన్న ఫిలాసఫీని, రోజూ పాఠాలతో సహా నూరిపోసే మీ నాన్నగారికి వెలకట్టడం నా అజ్ఞానం.

కానీ, మా నాన్న తీసుకున్న డబ్బుని తిరిగి ఇవ్వక్కర్లేదని ప్రభుత్వం చెప్పినా, నా మనస్సాక్షి వినడం లేదు. ఎప్పుడైనా ఎక్కడైనా, ఆఖరికి పైకెళ్ళినప్పుడైనా, మా నాన్న కనపడ్తే, తల ఎత్తుకుని ధైర్యంగా మాట్లాడగలను..."

నిశ్శబ్దంగా జానకమ్మగారు ఆ కవరుని తీసి చూశారు.

'మేష్టారుగారికి... గౌరవంతో' అని చదివి, అందులో ఉన్న చెక్ తీసి "అమ్మో! మూడు లక్షలా!" అని నోరు తెరిచారు ఆవిడ.

"మా అమ్మ చెయ్యనిది మీరు చేశారు. మా నాన్న చేయనిది మేష్టారు చేశారు. ఇది తీసుకుంటే నాకు తృప్తి... ఇది నేను చెయ్యాల్సినది" అప్పుడే పెద్దపళ్ళాల్లో ప్రమిదలు, వెలుగుతున్న ప్రమిదల్ని అందరూ అరుగు అంచున ఉంచుతున్నారు.

నా అడ్రస్సు, ఫోన్ నంబరు ఇచ్చి, తేలికైన మనసుతో వెనుతిరిగాను. ఋణం తీర్చాను. కానీ, ఇమోషనల్ ఋణం... దాన్ని నేనెప్పటికీ తీర్చలేను.

*నవ్య వారపత్రిక, 5 నవంబర్ 2008*